# గొలుసు



గొల్లపూడి రాజ్యలక్ష్మి

"అక్కా! ఎవరొచ్చారో చూడు !''

పెద్దచెల్లెలు కవితకు మల్లెపూలతో వంకుల జడవేస్తున్న లలిత పెరటి గుమ్మంలోంచి కన్పిస్తున్న వీధి వాకిలివైపు తొంగి చూసింది. ఎవరూ కన్పించలేదు.

''ఎవరొచ్చారూ ?'' అన్నది అనాసక్తిగా, తను లేచి వెళ్తే చెల్లెలి జడ చెడిపోతుందని. కూజాలోని నీళ్ళు గ్లాసులోకి వంపుకొని తీసుకెళ్తూ ''చెప్పాకో చూద్దాం !'' అంది చిన్నచెల్లెలు సరిత.

"దాని మొహంలేద్దూ ! వెంకటేశం బాబాయ్ అయివుంటాడు'' అన్నది కవిత తల ప్రక్కకి తిప్పి చూస్తూ.

''కదలకు !'' అన్నది కోపంగా లలిత.

ఒక నిమిషం ఆగి ''బావగాని కాదుకదా !'' అన్నది కవిత.

''బావా ?'' అన్నది అపనమ్మకంగా. ఒక్క క్షణం మెదడు మొద్దుబారినట్లయింది.

''నువ్వొచ్చి చాలా రోజులయింది కదా! పాపం విరహవేదనేమో !'' అన్నది వ్యంగ్యంగా – కిసుక్కున నవ్వింది.

''చాలారోజులా ? ఏళ్ళు... ఏళ్ళు గడిచినయి'' అన్నది పరధ్యానంగా.

''తన గురించి విరహమా ?'' తనలోనే విరక్తిగా నవ్వుకుంది. 'పిచ్చిపిల్ల ... దీనికి లోకం గురించి ఏం తెలుసు ! కలలు కనే వయసిది !' అనుకుంది లలిత. అయినా 'రాజారావుగాని రాలేదు కదా !' అన్న చిన్న అనుమానం రాకపోలేదు. ఇంక జడవేయటం సాగలేదు. 'వూడకుండా ఇట్లాపట్టుకో కొంచెంసేపు !' అని కవితను హెచ్చరించి – నలిగిన చీరె సరిచేసుకుని వీధివరండాలోకి వెళ్ళింది. తండ్రి కృష్ణమూర్తితో మాట్లాడుతున్న ఆగంతుకుణ్ణి చూస్తూనే కొయ్యబారిపోయినట్లు నిలబడిపోయింది లలిత.

ఆమె వంక పలకరింపుగా చూసి నవ్వాడతను.

''కాశీ వచ్చాడు లలితా !'' అన్నాడు కృష్ణమూర్తి – ఆమెను చూసి.

అప్పటికి కొంచెం నిలదొక్కుకుని–''ఎక్కడ్నించి రావడం ?'' అన్నది ముభావంతో. అతడు కొంచెం ఇబ్బందిగా కదిలి – ''హైద్రాబాద్ నుంచి ! నిన్న ఏలూరు వచ్చాను. నువ్వు .. ఇక్కడున్నావని తెలిసింది'' ఆమె వంక పరిశీలనగా చూశాడు.

లలిత కళ్ళ చుట్టూ నల్లని వలయాలు, రేగిన జుత్తులోంచి పండిపోయిన వెంట్రుకలు, పీక్కుపోయిన చెంపలు, కళ్ళల్లో గూడుకట్టుకుని వున్న దిగులు, అతనిలో ఆమెను చూశానన్న ఉత్సాహాన్ని హరించివేసినయ్.

''ఇంటికెళ్ళావా ?'' అన్నది చిన్నగా.

వెళ్ళానన్నట్లు వూపాడు తల. ''అది అమ్మేశారుటకదా !'' అన్నాడు నిరుత్సాహంగా. ఇంకా ఏదో అనాలని ప్రయత్నించి–కృష్ణమూర్తిని చూసి వూరుకొన్నాడు.

ఆయన అది గమనించి – లేచి లోపలికెళ్తూ – ''కూర్చొని మాట్లాడమ్మా !'' అన్నాడు.

కుర్చీలో కూర్చుంటూ కాశీనాథం వంక పరీక్షగా చూసింది లలిత.

బాగా పొడుగెదిగి తెల్లగా బొద్దుగా వున్నాడు. అతను వేసుకున్న బట్టలు, జోళ్ళు, చేతికున్నవాచి– ఖరీదుగా, ఆర్థికంగా అతనికే బాధలు లేవని తెలుపుతున్నాయి.

హేండ్ బేగ్‌లోంచి మామిడిపళ్ళు తీసి లలితకివ్వబోయాడు. అప్పుడే అతని కోసం కాఫీపట్టుకుని వచ్చిన సరిత నుద్దేసించి – ''అవి లోపలికి తీసికెళ్ళమ్మా !'' అన్నది లలిత. కాఫీగ్లాసు అతని ముందువుంచి పళ్ళు తీసుకుని వెళ్ళింది సరిత.

కాశీ మౌనంగా లలిత వంకే చూస్తున్నాడు. సాయంత్రం నాలుగ్గంటలవుతున్నా–మంటలు తగ్గని వేసవికాలపు ఎండను గమనించసాగింది లలిత.

కాశీనాధానికి ఆమెనట్లాచూస్తుంటే–తనకూ, ఆమెకూ దాటలేని అగాధమేదో మధ్యవున్నట్లు సంకోచంగా వుంది. 'ఈమె తనకు తెలిసిన లలితేనా?' అన్న సందేహంగా వుంది. ఏదో మార్పు ఆమెలో .. ఏమిటది ?

హఠాత్తుగా అతన్ని చూసి – నవ్వింది లలిత. ''ఊఁ...ఏమిటి సంగతులు? ఇన్నాళ్ళూ ఎలావున్నావ్ కాశీ ?'' అన్నది స్నేహంగా. ఎంతో నిగ్రహంగా – అతని ముందు ప్రవర్తించాలనుకున్నా – ఆమెకు తెలీకుండానే గొంతు వణికింది. ఏదో భరించరాని వేదన పైకి తన్నుకొస్తోంది. ఎన్నో అడగాలని -- ఎన్నో చెప్పాలని మనసు వేగిరపడుతోంది. ఉద్వేగంతో గుండె వేగం హెచ్చింది. కళ్ళల్లో వూరుతున్న చెమరింపుని నిగ్రహించుకోవటానికి ప్రయత్నిస్తోంది.

''నాకేం ? ... నేను బాగానే వున్నాను. కానీ... నువ్వు బాగా చిక్కిపోయావు – వదినా !'' అన్నాడతను - ఆర్ద్రంగా, మెల్లగా. అతని మాటలు అలలు అలలుగా చేరి – ఆమె చెవుల్లో ప్రతిధ్వనించినయ్. ఇంక దుఃఖాన్ని నిగ్రహించుకోవడం కష్టమైంది లలితకు. జలజలా రాలినయ్ కన్నీళ్ళు.

చటుక్కున లేచి ముఖం తప్పిస్తూ – "కాఫీ చల్లారి పోతోంది ... తాగు కాశీ. తర్వాత మాట్లాడు కుందాం" అనేసి ఎవరో తరుముకొస్తున్నట్లే లోపలికి వెళ్లిపోయింది లలిత.

తడిసిన ఆమె కంఠం – అతన్ని మరింత కలవర పరచింది. అయిష్టంగానే కాఫీగ్లాసు చేతిలోకి తీసుకున్నాడు.

తిరిగి పెరట్లోకొచ్చి, కవితదగ్గర కూలబడింది లలిత. ఎర్రబడిన ఆమె కళ్లు, ముక్కూ చూసి కవితా–సరితా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. నూతి గట్టుమీద కాళ్లు కడుక్కొంటున్న కృష్ణమూర్తి–"అల్లుడి దగ్గరకెళ్లివచ్చాడటనా?" అని ప్రశ్నించారు. "ఆఁ" అన్నది ముభావంగా. అన్యమనస్కంగానే పూలజడ పూర్తిచేసింది.

ప్రక్క ఇంట్లో ఆవకాయ కోసం–కారంగుండ కొట్టించుకొని అప్పుడే వచ్చిన తల్లి, "ఎవరే ఆ వచ్చింది ?" అనడిగింది.

ముగ్గురు కూతుళ్లూ దానికి జవాబివ్వక పోవటం చూసి ఆమె భ్రుకుటి ముడిపడింది. "అల్లుడొచ్చాడా ?" అన్నది ఆదుర్దాగా లలిత వంక చూస్తూ.

"ఊఁహు ... కాశీ వచ్చాడు" అన్నది హీన స్వరంతో – బెదురుగా చూస్తూ.

తల్లి ముఖం చిరుబురులాడింది. "ఇక్కడి కెందుకట ? చేసిన నిర్వాకం చాలకనా ? సిగ్గు లేకపోతే సరి ! '

"అమ్మా! నీకు పుణ్యముంటుంది...వూరుకో. అతన్నేమీ అనకు !" లలిత మెల్లిగా బ్రతిమిలాడింది.

"నా కడ్డురాకు లలితా ! వాలుగూకడిగి పారేస్తాను. అసలు నీ మెతకతనం వల్లనే వచ్చింది ఈ అరిష్టం అంతా !" అంది కంఠం హెచ్చించి.

"అమ్మా !" లలిత తీవ్రంగా చూసింది. "నువ్వింకోమాట అంటే నేనిక్కడే తల పగల కొట్టుకుంటాను. నేను బ్రతికి బాగుపడాలనుకుంటే నువ్వు మాట్లాడవద్దు !" లలిత కోపం చూసి ఆమె వూరుకుంది. "కన్నకడుపు కదూ...వూరుకోలేక ఏదో అంటూంటాను. నీ తల రాత నెవరు బాగు చేయగలరే ? ... నీ ఇష్టం !" అన్నది వంటగదిలో కెళ్తూ.

ఆ రాత్రి భోజనాలయిక కాశీనాధానికి మేడ పైన పక్కవేశారు. అతను పైకి వెళ్లాడు. అంత వరకూ అతనికి మాట్లాడటానికి అవకాశమివ్వలేదు లలిత. ఆమెలో చెలరేగుతున్న సంఘర్షణ అప్పటికి కొంత శాంతించింది. తనను తాను కూడదీసుకుని స్థైర్యం తెచ్చుకుంది. తల్లీ–తండ్రీ, చెల్లెళ్లూ పడుకున్నా ఆమె పక్కమీద పొర్లుతూనే వుంది. మేడపైన కాశీనాధానికి కూడా నిద్ర వుండదని ఆమెకు తెలుసు.

ఇక అలా ఎక్కువసేపు పడుకోలేక తలుపు తీసుకుని బైటకొచ్చింది. శుక్లపక్షం అవడంవల్ల బైట వెన్నెల. అంతా నిశ్శబ్దం. నెమ్మదిగా మెట్ల వైపు నడిచింది. ఒక మూలగా పిట్టగోడపై కూర్చుని, సిగరెట్ కాలుస్తూ – దూరంగా కన్పిస్తున్న రైల్వేస్టేషన్‌లోని లైట్లవైపుచూస్తూ– ఆలోచిస్తున్న కాశీనాధం అలికిడికి మెట్లవైపు చూశాడు. పైమెట్టుమీద సంకోచంగా నిలబడి పోయిన లలితకు కాశీనాధం తానెరుగని కొత్త వ్యక్తిలా అవుపించాడు.

'అవును...ఇప్పటిమాటా ? ఆరేళ్లు దాటింది. ఇంకా అతను 'వదినా !' అంటూ తన కొంగు పట్టుకుని తిరిగే పసివాడా ?' అనుకుంది నిర్వేదంగా. మనసంతా చేదు తిన్నట్లయింది. వెనక్కి తిరిగి పోదామా అనుకుంది.

"రా వదినా ! నిలబడిపోయావేం ?" సిగరెట్ క్రిందవేసి నలిపి దగ్గరగా వచ్చాడు.

"ఇంకా నువ్వు నిద్రపోలేవా ?" అన్నది ఏదో ఒకటి మాట్లాడాలి కనుక అన్నట్లు.

"నిద్రా ?" నవ్వాడు. "కంటినిండా నిద్ర పోయి కొన్నేళ్లయింది" అన్నాడు.

అతని నించి వస్తోన్న సిగరెట్ వాసన ఆమెకు దుర్భరంగా వుంది.

"ఈ అలవాటు ఎప్పట్నించి కాశీ ?" అన్నది దిగులుగా. ఆమె కళ్లముందు తనుకన్న అందమైన కలలు తగలబడిపోతున్నప్పుడు కలిగే ఆవేదన ఆమె కంఠంలో ధ్వనించింది.

ఆ ప్రశ్న విప్పించుకోనట్లే– "కూర్చో వదినా !" అన్నాడు. లలిత చాపమీద కూర్చుంది. "ఇన్నేళ్ల తర్వాతయినా – నీ కళ్లల్లో వెలుగు చూస్తాననుకున్నాను వదినా !" అన్నాడు నిరుత్సాహంగా. తనూ చాపమీద ఆమెకు కాస్త దూరంగా కూర్చున్నాడు. ఆమె మనసు భగ్గుమన్నట్లయింది. "ఎంత నటన నేర్చావ్ కాశీ ! ఇదంతా వదినపై అభిమానమేనా ?" అన్నది వెటకారంగా.

"నటనా ?" అన్నాడు దెబ్బతిన్నట్లయి.

"కాక ! ఆరేళ్ల క్రిందట జరిగిన సంఘటన మర్చిపోయావా ? అవును ... నువ్వు మగాడివికదా ! ఆ లక్షణాలు ఎలాపోతాయి ? ఏమీ జరగనట్లే ప్రవర్తిస్తున్నావే ? ఆ రోజు ... నువ్వు ఇల్లు విడిచి పోయేముందు నీ వదిన పరిస్థితి ఏమిటో నీకు తెలియదా ? కనీసం నాతో చెప్పిపోవాలని కూడా అన్పించలేదు కదూ ? వెళ్తూ వెళ్తూ నువ్వు చేసిన పనికి నేనేమైపోతాననుకున్నావు ? చాలు కాశీ ! నాకీ మనుషులపైనే నమ్మకం పోయింది. నేనొక జీవచ్ఛవాన్ని. అంతే" కంఠం రుద్ధమైంది.

"వదినా ! ప్లీజ్ ... వూరుకో ! నీకు నాపై కోపం వచ్చిందా ! నేను నీ కాశీని వదినా ! నాపై ఇన్ని నేరాలు నువ్వేనా వేసేది ? నన్ను నువ్వైనా అర్థం చేసుకుంటావని అనుకున్నాను."

లలిత కళ్లు తుడుచుకుంది మౌనంగా.

"అమ్మని పసితనంలోనే పోగొట్టుకున్న నన్ను నీ ఒడిలో పెంచి మాతృత్వాన్ని చవిచూపావు. అమ్మ బ్రతికివుంటే నీలాగే వుంటుందనుకొన్నాను. అలాంటి నిన్ను ... " లలిత మధ్యలోనే అడ్డుకుని – "ఆవు కాశీ ! అవన్నీ గుర్తుచేసి మానిపోయిన గాయాల్ని కెలకవద్దు. నీకా గౌరవం వుంటే – వెళ్లబోయే ముందు నీ పరిస్థితులేమిటో నాకు చెప్పేవాడివి" నిష్ఠూరంగా అంది.

"ఉత్తరం రాశాను."

"ఎప్పుడు ?" ఆశ్చర్యంగా అన్నది.

"అయితే ... ఆ ఉత్తరం నువ్వు చూడలేదా? అనుమానిస్తూనే వున్నాను. కానీ ... "

"ఏమిటి మవ్వనేది ? ఎప్పుడు రాశావ్ ?"


"వెళ్లబోయేముందు నీకు ఉత్తరం రాసి నీ దిండు క్రిందపెట్టాను."


"అబద్ధం !" అన్నది కోపంగా.

"నేనేం చెప్పి నిన్ను నమ్మించేది ?"

"నన్ను నమ్మించటానికి ఇన్ని పాట్లా ?"

"ఆల్ రైట్ ! ఇక నేనేం చెప్పలేను" నిస్పృహగా అన్నాడు.



"అయితే నువ్వనేది ఏమిటి? ఆ ఉత్తరం మీ అన్నయ్య దాచేసి వుంటారనా?"

"ఖచ్చితంగా!"

"దానివల్ల ఆయన కొరిగేదేమిటి? నమ్మలేను కాశీ!"

"నీ అమాయకత్వాన్ని వాడుకోవడం అన్నయ్య కలవాటేగా! సరే! జరిగిందేదో జరిగిపోయింది. నేను వెళ్లిపోయాకయినా అన్నయ్యలో మార్పు వస్తుందనుకున్నాను. కానీ ... కానీ ఇట్లా జరుగుతుందనుకోలేదు ఇది తెలిసినప్పటి నుంచి నా గుండెలు మరడిపోతున్నాయి. ఎట్లాగయినా నీ కాపురం సరిదిద్దుతాను. అప్పటికి కాని నాకు శాంతి వుండదు!"

"అది వృథాప్రయాస కాశీ...నువ్వు నా కాపురం సరిచేయాలనుకున్నా — నేను దానికి సిద్ధంగాలేను. ఆయనతో విసిగిపోయాను. ఆయన పట్ల నా మనసు విరిగిపోయింది. కారణాలు నేను చెప్పటం ఎందుకు? నువ్వు ఏలూరు వెళ్లేనచ్చావుగా! నీకు తెలిసే వుండాలి."

"విన్నాను. కానీ నీ జీవితం ..."

"ఇంక ఆ సంగతి వదిలేయ్!" అన్నది విసుగ్గా.

కాశీనాథం రెండు నిమిషాలు పూరుకుని — తన చొక్కాజేబులోంచి ఓ పొట్లాం పైకి తీశాడు.

"ఇదిగో వదినా!" అన్నాడు ఆమె ముందు వుంచి.

"ఏమిటిది?"

తీసి చూసాడు.

ఆ వెన్నెట్లో తళతళా మెరిసింది గొలుసు.

"కాశీ!" అంది ఆశ్చర్యంగా — నమ్మలేనట్లు.

"నన్ను క్షమించు వదినా!" ఆమె చేతుల్లో ముఖం వాల్చాడు.

శిలా విగ్రహంలా కూర్చుండిపోయింది లలిత. గతమంతా ఆమె కళ్లముందు తెరలు తెరలుగా కదిలినయ్.

* * *

లలిత రాజారావుతో వైవాహిక జీవితాన్ని పంచుకోబోయేనాటికి కాశీనాథం వయసు ఆరేళ్లు. అప్పటికే మామగారు గతించారు. సరస్వతి ఆయనకు రెండో భార్య. చాలాకాలానికి వచ్చిన కానుపు అవడం వల్ల — ఆ కానుపులో జబ్బుచేసింది సరస్వతికి. దాదాపు మంచంలోనే వుండేది. రాజారావుకి సరస్వతిపై అంత సదభిప్రాయం లేకపోవడంవల్ల — వారిద్దరిమధ్య సఖ్యత కూడా అంతంతమాత్రమే. చీటికి మాటికి ఆమెను ఆడిపోసుకునేవాడు. కాశీని ఛీదరించుకునేవాడు. లలితకి అది అంతగా నచ్చేదికాదు. ఆమె సవతి తల్లి ... నిజమే. అంతమాత్రాన అంత హీనంగా ఎందుకు చూడాలో ఆమెకు మొదట్లో అర్థం కాలేదు. పైగా జబ్బుమనిషి కూడా! లలిత కామెపై సానుభూతి కలిగింది. పసివాడైన కాశీ బాధ్యత తను సంతోషంగా పైనవేసుకుంది. తర్వాత .. తర్వాత రాజారావుని గురించిన నిజాలు తెలిసినాయి లలితకి.

తల్లిని పోగొట్టుకున్న రాజారావుని అతి గారాబంగా చూసుకునేవాడు తండ్రి. సరస్వతి ఆయనకి ద్వితీయ కళత్రంగా వచ్చేనాటికి—రాజారావు మొండిగా — పెంకెగా తయారయివున్నాడు. కొన్నాళ్ల సహించినా అతన్ని సంస్కరించబూనుకోవటంతో — సరస్వతి అటు భర్తకీ — ఇటు రాజారావుకి కూడా అయిష్టురాలయింది. అప్పుడు మొదలైన స్పర్థ రాజారావుతోపాటు పెరిగిందే కాని తరగలేదు. తండ్రి పోతూ, వున్న నాలుగెకరాలూ — ఇల్లూ రాజారావు కిచ్చి — సరస్వతిని జీవితాంతం పోషించే బాధ్యతను అప్పగించిపోయాడు.

అప్పటికి తాను గర్భవతినన్న విషయం ఆయన పోయాక తెలిసింది - సరస్వతికి. తెలిసినాక — ఆందోళనపడింది—పుట్టబోయే పసికందు — భవిష్యత్ ఏమిటి? అని. 'రాజారావు ఎంత కర్కోటకుడైనా — తన తోబుట్టువుకు ఏదో ఒక దారి చూపించక పోతాడా? అన్యాయం చేస్తాడా?' అని తనకు తాను నచ్చచెప్పుకుంది. రాజారావు స్వభావానికి అనుకూలంగా సర్దుకుపోయి అతని ఇష్టాన్ని పొందాలని చూసింది. ఆమె సర్దుకుపోయే తత్వం రాజారావులో మరింత చిరాకును పెంచి — లోపాల్ని వెతికి మరీ చెండాడుకు తినేవాడు.


కాన్పు కష్టమై — ఆరోగ్యం చెడిపోయినప్పుడు — పసికందయిన కాశీని చూసి చాలా బెంగపడింది సరస్వతమ్మ. లేని ఓపిక తెచ్చుకుని పసివాడి ఆలనా — పాలనా చూసేది. ఆమె అట్లా అనారోగ్యంతో బాధపడుతున్నా — కాశీని దగ్గరకన్నా తీసేవాడు కాదు రాజారావు. తన దగ్గరకు అమాయకంగా పాక్కుంటూ వచ్చే కాశీని విదిలించుకునేవాడు. కాశీని చూసినప్పుడల్లా రాజారావుకి తన ఆస్తిలో వాటాదారుడిగానే కన్పించేవాడు. దానితో అతని మనసు అసహనంతో కుంచించుకుపోయేది.


తండ్రి పోవడం — తను సంపాదనపరుడవటం, ఆస్తి కూడా చేతికి రావడంతో రాజారావుకు ఫ్రెండ్స్ — పార్టీలు, పేకాటలు అన్నీ అలవడినాయి. ఆ సమయంలోనే లలితను 'చూడటం, ఇష్టపడి పెళ్లి చేసుకోవడం జరిగింది.

చాలా రోజుల వరకు లలిత రాజారావు అలవాట్లను తెలుసుకోలేకపోయింది. అప్పుడప్పుడు రాత్రిళ్లు ఆలస్యంగా రావడానికి కారణం ఆఫీసులో పని వొత్తిడి అనుకుంది. శలవు రోజుల్లో పూర్తిగా స్నేహితుల ఇళ్లల్లో గడిపి వొస్తే — 'అతను స్నేహం అంటే ప్రాణం ఇస్తాడు కాబోలు' అనుకుంది. కాని తనతో — ఒక సరదా అయిన మాట — తన చుట్టూ తిరగకపోయినా — ఒక నెల రోజులకయినా తన్ని తీసుకుని ఒక సినిమాకయినా వెళ్లని అతని మనస్తత్వంపట్ల అసంతృప్తి ఏర్పడింది. అప్పుడప్పుడు తాగి వచ్చి తన దగ్గరకొచ్చినప్పుడు — ఆ వాసన భరించలేక దూరంగా నెట్టేసేది. పట్టరాని కోపంతో రాజారావు చెయ్యి చేసుకున్నప్పుడు ప్రపంచం తల్లక్రిందులైనంతగా తల్లడిల్లింది. క్రమంగా అతను ఆమె మనసులో స్థానాన్ని దూరం చేసుకున్నాడు. రాజారావు పట్ల అసహ్యం అప్పుడే ఆమెలో అంకురమయింది.

లలితకు రాజారావు ఇంటికి రానంతవరకు 'రాలేదే!' అన్న దిగులు. వచ్చాక 'ఎందుకొచ్చాడా!' అన్పించేది. లలిత చేసిన వంటకు వంకలు పెట్టేవాడు. కాశీని అకారణంగా కసిరి కొట్టేవాడు. జోక్యం చేసుకున్న లలితపై చెయ్యి చేసుకునేవాడు. సరస్వతమ్మ ఇవన్నీ చూసి మరింత కృశించిపోయింది. కాశీ భవిష్యత్ గురించిన దిగులుతోనే కన్ను మూసింది.

సవతి తల్లి అయినా — తన్ను కొంత కాలం సాకిందన్న అనుబంధమన్నా — రాజారావు కళ్లల్లో



నీరు తెప్పించలేకపోయింది — ఆమె పోయినప్పుడు. లలిత అచ్చెరువు చెందింది — అతని వైఖరికి.

పసివాడైన కాశీని ఓదార్చి — తన గుండెల్లో దాచుకుంది. తల్లిని మరపించి తానే తల్లయింది. కాశీని అట్లా లలిత దగ్గరకు తీయటం రాజారావుకి యిష్టం వుండేది కాదు. ఎన్నోసార్లు వాణ్ని దూరంగా వుంచమని, నెత్తి కెక్కించుకోవడం మంచిదికాదని హెచ్చరించాడు. పసివాడిపైన ఈ అకారణ ద్వేషం నచ్చని లలిత అతని మాటలు ఖాతరు చేయలేదు. ఆ కోపంతో ఎన్నో హింసలు పెట్టేవాడు రాజారావు.

రాజారావు మనస్తత్వమేమిటో లలితకు అంతు పట్టలేదు. 'తనని ఇష్టపడే చేసుకున్నాడు. మొదట్లో కాస్త అభిమానంగానే వుండేవాడు. ఇప్పుడతనికున్న పేకాట - తాగుడు లాంటివి చాలామంది మగాళ్లలో వున్న అలవాట్లే. అంత మాత్రాన వాళ్లంతా ఇంట్లో భార్యలపట్ల, ఇట్లాగే ప్రవర్తిస్తున్నారా ? ఇట్లా చీటికి మాటికి ఛీదరించుకుని -- ఎదుటి మనిషిని గాయపరచటం, అంతా తన ఇష్టప్రకారమే — తన చెప్పుచేతల్లో వుండాలనుకోవటం ఇవన్నీ ఏమిటి ? మగవాడినన్న అహంకారమా ? లేక ఏదైనా మానసిక జాడ్యమా?' ఈ విధమైన ఆలోచనలు లలితను కృంగదీసేవి. తనలోని భయాలు, ఎట్లాంటి సంసార జీవితం తను కోరుకుంటూందో — అతనితో చెప్పాలని ఎన్నోసార్లు ప్రయత్నించింది రాజారావుకి ఎదుటి మనిషిని అర్థం చేసుకునే అలవాటు లేకపోవడంవల్ల ఆమె ప్రయత్నాలేమీ సాగలేదు. లలిత కెంతో ఒంటరితనంగా – దిగులుగా వుండేది. తల్లి — తండ్రికి చెప్పకుందామా అన్పించింది. కానీ దానివల్ల ఎట్లాంటి పరిణామాలు సంభవిస్తాయో అని భయం. తల్లి ఆవేశపరురాలు రాజారావు ముఖాన్నే అన్నీ కడిగేయగలదు. దానివల్ల తన సంసారానికి ముప్పు వాటిల్లినా ఆశ్చర్యం లేదు రాజారావు అంతటి మూర్ఖుడు కూడా. అయితే అట్లాంటి మూర్ఖుడితో కలిసి కాపురం చేయకపోతేనేం ? అన్పించవచ్చు. ఇంకా లలితలో అట్లాంటి విప్లవ భావాలు కలుగకపోవడానికి—పసివాడైన కాశీనాథంపై కరుణ, మమతలు కారణం. తనలోని అశాంతిని మరిచిపోవడానికి కాశీతో కలిసి అల్లరి చేసేది — ఆటలు ఆడేది. పాటలు పాడేది. పాఠాలు అర్థం కానివి విప్పి చెప్పేది. కాశీని తీర్చిదిద్దటంలో మానసికోల్లాసాన్ని పొందేది.

కాశీ 'వదినా !' అని పిలుస్తుంటే 'అమ్మా !' అని అన్నట్లే అన్పించేది. దానికితోడు గర్భం రావడమే ఆలస్యంగా రావడం, అది నిలవకపోవడం, అట్లా నాలుగుసార్లు జరిగాక ఆమె తల్లి అయ్యే యోగ్యతను కోల్పోవడం జరిగింది.

కాశీనాథానికి పదిహేను ఏళ్లు వచ్చేసరికి — తల్లి — దండ్రి — గురువు అన్నీ తానే అయింది లలిత.

స్కూలుకి వెళ్లటం — చదువుకోవడం తప్పించి మిగతా టైము లలితకు ఇంటి పనులలో సాయం చేయడం, స్కూలు కబుర్లు చెప్పడంలో గడిపేవాడు కాశీ. అన్నగారి కోసం అర్ధరాత్రిదాకా ఎదురుచూసే లలితను చూస్తే కాశీకి దుఃఖం, జాలి కలిగేవి. ఆమె ఓర్పుకి — సహనానికి మనసంతా గౌరవంతో నిండిపోయేది. ఎప్పుడైనా విసిగి ఆమె కళ్లల్లో తడి మెరిసినప్పుడు రాజారావును తన్నాలన్నంత ఆవేశం కలిగేది. ఆమె కన్నీళ్లు తుడిచి 'నీకు నేనున్నాను వదినా !' అని చెప్పాలనిపించేది.

కాశీనాథం పదవ తరగతి మంచి మార్కులతో పాసయినప్పుడు లలిత ఆనందానికి అంతేలేదు. రాజారావు విని వూరుకున్నాడు — తనకు సంబంధించినది కానట్లు. అప్పటినుంచి ఇంట్లో కలతలు— సమస్యలు మరింత జటిలమయినయి.

బలంగా — పొడుగ్గా ఎదిగి తనవంక నిర్లక్ష్యంగా చూసే కాశీ అంటే ద్వేషం పేరుకుపోసాగింది రాజారావులో. కాశీ కాలేజీలో చేరుతానన్నప్పుడు ససేమిరా వీలులేదన్నాడు. లలిత రాజారావుకి నచ్చచెప్పాలని ఎంతగానో ప్రయత్నించింది.

"కాశీ తెలివైనవాడు. చదివిద్దామండీ !"

"చదివింది చాలు. ఎక్కడో అక్కడ ఉద్యోగం చూసుకోమను. నా దగ్గర డబ్బు లేదు !"

"మనకూ పిల్లలు లేరు. వాడిని చదివించటం అంత కష్టమా ?"

"ఏం ? నీ దగ్గరేమన్నా ముల్లె వుందా ? చెప్పు."

"నా దగ్గర వున్నదేమిటో మీకు తెలుసు. ఎందుకీ వాదనగానీ కాశీ చదువుకు భంగం కలుగటానికి వీల్లేదు. అవసరమైతే ఈ ఇల్లు అమ్మయినా..."

"నోర్మూసుకోవే ! ఇల్లు అమ్ముతావా ? ఎక్కడుంటావు తర్వాత ?"

"ఇప్పుడు కాకపోయినా — ఎప్పటికయినా మనం చెట్టుక్రిందకు మారాల్సినదేగా. ఫర్వాలేదు." అన్నది నిర్భయంగా.

"అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి ? నేనీ కొంపను కూడా మిగల్చకుండా తగలేస్తాననా ?" అన్నాడు మండిపడుతూ.

"నా నోటితో చెప్పడమెందుకు ? మీకు తెలియకపోతేగా ?" అన్నది శుష్కహాసం చేస్తూ.

అంతే ! ఆమె చెంప అదిరిపోయింది. కొంచెం సేపు ఏమీ కళ్లకు కన్పించలేదు. శబ్దాలు విన్పించలేదు. తానే పరిస్థితిలో వుందోకూడా లలితకు అర్థం కాలేదు. తిరిగి చుట్టూ వున్న ప్రపంచం కాస్త కాస్త కన్పించేసరికి రాజారావు లేడు గది గుమ్మంలో నిలబడి దిగాలుగా చూస్తున్న కాశీనాథం కన్పించాడు.

"అన్నయ్య ఏరి ?" అన్నదతన్ని ఉద్దేశించి.


"వెళ్లిపోయాడు."


"నిన్ను కాలేజీలో చేర్పించమన్నారు కాశీ !" అన్నది తడబాటుని కప్పిపెట్టుకుంటూ.

"అంతా విన్నాను. అతని కిష్టంలేకపోయినా సరే నేను చదివితీర్తాను." అన్నాడు పట్టుదలగా. అన్నట్లుగానే కాలేజీలో చేరాడు. అప్పటికి లలిత తన గాజుల జత అమ్మి ఆ డబ్బు ఉపయోగించింది.

తన ఇష్టానికి వ్యతిరేకంగా కాశీ కాలేజీలో చేరగానే — ఇంటి ఖర్చులకు డబ్బు ఇవ్వడం మానేశాడు రాజారావు. లలిత కది కష్టంగానే వుంది. పట్టుదలా పెరిగింది. వీధి గది అద్దె కిచ్చింది. మరీ కటకటగా వున్నప్పుడు తండ్రికి రాసి సహాయం తీసుకోసాగింది.

తను చదువు వొద్దన్నప్పుడు — మానివేయక పోగా — వెక్కిరించినట్లు తనముందే — తనతో ప్రమేయం లేకుండా కాశీనాథం చదువుకోవటం, ఇంట్లో యధావిధిగా అన్ని అవసరాలు తీరడం రాజారావుకు తల కొట్టేసినట్లు అన్పించింది. లలితను మాటలతో చిత్రహింస మొదలుపెట్టాడు



ఆమె వంటిపై వున్న మిగతా నగలన్నీ వొలిచి ఇమ్మని వొత్తిడి చేయసాగాడు. ఇంక ఆ నగలు తనకు దక్కవని లలితకు అర్థమైంది. తన పుట్టింటివారు పెట్టిన రెండు పేటల చంద్రహారం తీసి రాజారావుకు తెలియకుండా భద్రపరచింది. మిగతావి తీసి అతని దోసిట్లో పోసింది. అయినా రాజారావుకు ఇంకా ఆమె దగ్గర డబ్బు వుందని అనుమానం. 'లేకపోతే ఇల్లు ఎట్లా గడుపుతోంది?' అనుకున్నాడు. అందుకే - ''డబ్బు కావాలి ఓ వంద వుంటే ఇవ్వు!'' అన్నాడు.

''నా దగ్గరెక్కడిది? సంపాదించేది మీరు!''

''వాడినెట్లా చదివిస్తున్నావు? వాడా - నేనా మొగుడు?''

''నోటికెంతొస్తే అంతా అనొద్దు. దానికీ హద్దుంది.'' అన్నది అసహ్యంగా చూస్తూ.

''నోర్ముయ్! నాకు నీతులు చెప్పకు. పెద్ద పతివ్రతవి!''

ఇంక అతనితో మాట్లాడటం వెకిలితన మనిపించింది. 'నిజమే! ఇంత నీచుడితో ఇంకా ఈ ఇంట్లో వుండటంకంటే హీనం ఏముంది? ఎంత వ్యసనపరుడైనా - క్రూరుడైనా ఇంకా తన 'భర్త' అన్న భావం వీడక మరో పురుషుడి వైపు కన్నెత్తి చూడని తన మనస్తత్వంపై చీదర కల్గింది మొదటిసారిగా. ఇదే బ్రతుకని రాజీపడిపోయిన తన జీవితంపై అసహ్యం పుట్టింది లలితకు.

''ఏం మాట్లాడవు?''

''నన్ను విసిగించక-మనిషిలా ప్రవర్తించండి!''

''అంటే? నేనిప్పుడు పశువునా?''

''అది నిర్ణయించుకోవల్సింది మీరు'' అన్నది నిర్లక్ష్యంగా.


రాజారావు నిర్భాంతపోయాడు. అతడెప్పుడూ లలిత నుంచి ఇట్లాంటి తిరస్కారం ప్రాహించలేదు. అతనిలోని మృగం మండిపడింది తటాలున ఆమె జుట్టు పట్టుకుని గుంజుతూ కసిగా బాదసాగాడు. లలిత తన్ని కానట్లే నిర్లిప్తంగా శరీరాన్ని వప్పగించింది.


రాజారావు ఇట్లా అనేక తడవలు ఆమెను హింసించడం, లలిత నిశ్శబ్దంగా ఏడ్వడం కాశీ కళ్ల ముందే జరిగినా - లోలోపల పళ్లు కొరుక్కోవడం తప్పించి రాజారావుతో ముఖాముఖీ తలపడలేదు. కానీ ఈ తడవ కాశీ తన్ను తాను నిగ్రహించుకోలేక పోయాడు లలితను రాజారావు చేతుల్లోంచి విడదీసి రాజారావును వెనక్కి బలంగా తోశాడు. తూలి గోడమీదకు పడ్డ రాజారావుకు కాసేపటిదాకా ఏమీ కన్పించక దిమ్మెరపోయాడు.


తన కళ్లముందు పుట్టి పెరిగిన కాశీ తనపై చెయ్యి చేసుకోడమా? అతని కళ్ళు నిప్పులు కక్కినయ్. విసురుగా లేవబోయాడు కానీ ఆ పడటంలో కాలు మెలికపడి బెణకటంతో లేవలేక పోయాడు.

లలిత చాలా ఆశ్చర్యంగా కాశీని ఎవరో కొత్త వ్యక్తిని చూసినట్లు చూడసాగింది

''జాగ్రత్త! ఎళ్లీ వదినపై చెయ్యి ఎత్తావంటే...'' రాజారావును హెచ్చరిస్తూ లలిత వైపు చూసిన కాశీ ఆగిపోయాడు లలిత చూపుల్లో






ఏ భావం కన్పించిందో — నిశ్శబ్దంగా వెనుదిరిగి ఆ గదిలోంచి వెళ్ళిపోయాడు.

'నా పెళ్ళాంరా... నా ఇష్టం... నువ్వెవడివిరా అడగటానికి ? నా పెళ్ళాన్ని నాకు కాకుండా చేసి నా పై తిరగబడ్తావా ? నీ రక్తం కళ్ళ చూస్తాన్రా. ఒరేయ్ ! నీకు సిగ్గు — లజ్జ వుంటే ముందు నా ఇంట్లోనుంచి బయటికి ఫో. రోషం వున్నవాడి వైతే నీ అంతట నువ్వు బ్రతుకు. నువ్వింకో క్షణం ఈ ఇంట్లో వుంటే నిన్ను — దీన్ని చంపి పాతరేస్తా...' రాజారావు కేకలు కాశీకి వినబడుతూనే వున్నాయి. అప్పటికే ఇరుగు — పొరుగువారు గుమ్మాల్లోంచి తొంగి చూస్తున్నారు వినోదంగా.

"అంతా నీ మూలకంగానే... నీ వల్లనేరా నా సంసారం నడివీధి కొచ్చింది. ఈ కొంపలో శనిలా దాపురించావు. ఆ ముసల్దానితోపాటే నువ్వూ పోయి వుంటే పీడ వదిలిపోయేది !" రాజారావు అరుపులు.

కాశీ ఆవేశం దిగజారి ఖిన్నుడైనాడు. నిశ్శబ్దంగా ఓ మూల కూర్చొని తన భవిష్యత్తేమిటో ఆలోచించుకోసాగాడు.

రాత్రి చాలా సమయం గడిచింది. ఎక్కడి వాళ్ళక్కడ అట్లాగే వుండిపోయార. ఎవరికీ భోజనాలు లేవు.

కాశీ కంటిమీద కునుకు లేదు. కళ్ళముందంతా భయంకరమైన చీకటి ! ఆ అంధకారంలో దిక్కుతోచని పరిస్థితి !

'తన మూలకంగా నేనా ? నిజంగా అదేనా ఈనాటి వదిన పరిస్థితికి కారణం ? తను లేకుంటే వదిన్ని బాగా చూస్తాడా ? ఇద్దరూ సంతోషంగా వుంటారా ? తను ఎక్కడికైనా వెళ్ళిపోతే... దూరంగా... చాలా దూరంగా...' కాశీకి మార్గం గోచరించినట్లయింది.

తెల్లారిన తర్వాత కాశీ లేడు !

లలిత దాచిన గొలుసూ లేదు !!

* * *

వెన్నెల తెల్లగా చల్లదనాన్ని వర్షిస్తూనేవుంది.

గూడు కట్టుకునివున్న నిశ్శబ్దంలోంచి ఇద్దరూ బైటపడలేనట్లుండిపోయారు.

"ఎంతపని చేశావు కాశీ ! ఇది నువ్వు చేసిన పని అంటే నమ్మలేకపోతున్నాను" అన్నది లలిత

## గొలుసు

చివరికెట్లాగో గొంతు పెగల్చుకుని.

కాశీనాథం తనలో తాను కుంచించుకుపోతూ— "ఇది తప్పు అని నాకు తెలుసు వదినా ! కాని ఆ పరిస్థితిలో నాకు అంతకంటే మార్గం ఏముంది ? ఆవేశంలో అన్నయ్యమీద చెయ్యి చేసుకున్నాను. నువ్వు నిందాగర్భంగా చూశావు. ఆ రాత్రి నేను అనుభవించిన నరకం నీ కెట్లా చెప్పను ! అన్నయ్యకు క్షమాపణ చెప్పటం నా కిష్టంలేదు. ఇంట్లోంచి నేను దూరమైతే — మీరిద్దరైనా సుఖంగా అన్యోన్యంగా వుంటారేమో, నా వల్లనేకదా మీ ఇద్దరిమధ్య కలతలు ! అనుకున్నాను. నీకు ముఖం చూపించాలన్పించలేదు. నా భవిష్యత్ కేదో ఒక ఆధారం కావాలి. అది దొరికేదాకా బతకాలి. దానికి డబ్బు అవసరం ! నీ దగ్గరవుండదని నాకు తెలుసు. అందుకే ... ఈ నీచానికి పాల్పడ్డాను. నీ వస్తువు నాకు ఉపయోగపడకూడదా ! అనుకున్నాను. మళ్ళీ నీ వస్తువు నీకు పువ్వుల్లో పెట్టి ఇవ్వాలనే నిశ్చయంతోనే ఆ పని చేశాను. నువ్వు ఇంత బాధపడతావనుకోలేదు" నెమ్మదిగా—స్పష్టంగా అంటూ చివరి వాక్యం దెబ్బతిన్నవాడిలా అన్నాడు.

లలిత చివ్వున చూసింది. "నేనెందుకు బాధ పడుతున్నానో తెలిస్తే — నువ్విలా అనవు. అప్పుడు నీ మార్గం నువ్వు చూసుకున్నావు ! బాగుంది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలుసా ? ఒక విధంగా నేనిక్కడిట్లా వుండటానికి కారణం నువ్వే...నువ్వే! తెలుసా ?"

"నేనా ?"

"అవును ... నువ్వే ! నువ్వు తీసుకెళ్ళిన ఈ గొలుసువల్ల చాలా రాద్ధాంతం జరిగింది. ఆ రాత్రి గడిచాక నువ్వు లేవు. మీ అన్నయ్యలేరు. ఒంటరిగా నేను !! నువ్వేమయినావో అన్న దిగులు. తెలిసిన వాళ్ళందర్నీ అడిగాను. ఎవరూ చెప్పలేకపోయారు. ఎప్పుడూ నన్నొదిలి అంతకాలం వుండలేదు. ఆయనన్న మాటలకు ఏ అఘాయిత్యమన్నాచేయలేదు గదా ... అన్న అనుమానం. దానికితోడు గొలుసు లేదు. అది ఆయన పనే అనుకున్నాను. ఎన్నోసార్లు ఆ గొలుసు ఇవ్వమని అడిగినా ఇవ్వలేదు నేను. అది కూడా అమ్ముకుని తగలేస్తారని ! ఆ తర్వాత నాల్గు రోజులకు ఇంటికి వచ్చారు మీ అన్నయ్య. గొలుసు సంగతి అడిగాను.


"ఏం గొలుసు ?" అన్నారు ఏం తెలియనట్లు.

"నాకు మా వాళ్ళిచ్చింది. అది అమ్ముకోడానికి సిగ్గులేదూ ?" అన్నాను కోపంగా. ఆ గొలుసు నేనే ఎక్కడో అమ్మేసి నీకా డబ్బిచ్చి ఇంట్లోంచి పంపివేశానని నానా మాటలూ అన్నారు. నాలో భరించలేనంత వంటరితనం. విరక్తి ! 'ఛీ ఈ మనిషి ఇక ఇంతే !' అనుకున్నాను. ఇన్నాళ్ళూ ఎన్నోవిధాల మార్చాలని ఆయనపట్ల నాకున్న అయిష్టతను, అసహ్యాన్ని దిగమింగుకుని ప్రయత్నించి విసిగిపోయాను. ఆయన భార్యననే సంగతి విస్మరించలేక — తనలోని బలహీనతల్ని ఒప్పుకోలేక — ఒప్పుకోకుండా చేసేదేమీలేక రాజీపడి బ్రతికాను. ఇంక పోరాడలేననిపించింది. నాకు మనశ్శాంతి కావాలి. అందుకే వచ్చేసాను శాశ్వతంగా" కొంచెంసేపాగి మళ్ళీ అన్నది లలిత :

"నేనిప్పుడు మొగుడ్ని విడిచినదాన్ని — లోకం దృష్టిలో. అమ్మా—నాన్నలకు గుదిబండను. నా గురించి చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళుకావేమో అనివాళ్ళభయం.

### ధరను చెప్పే యంత్రం !

జపానులోని యాటో సేల్స్ కంపెనీ వారు క్రొత్తరకం తూకపు యంత్రాన్ని తయారుచేశారు. ఈ క్రొత్త యంత్రం వివిధ వస్తువుల తూకాలను, వాటి ధరలను నిర్ణయించి ఒక లేబిల్ పై ముద్రించడమేగాక, కస్టమర్లకు కూడా చెబుతుంది. దీనికోసం ఒక మిశ్రిత ఎలక్ట్రానిక్ స్వరాన్ని యీ కంప్యూటరుకు అమర్చారు. ధరలను నిర్ణయించి లేబిల్ పై ముద్రించే యంత్రాలు జపానులోను, యితర పారిశ్రామిక దేశాలలోనూ అతి సామాన్యమే. అయితే నోటితో చెప్పినట్లు కస్టమర్లకు వాటి ధరలను చెప్పే యీ యంత్రం మాత్రం అపూర్వం. అంతేగాక యీ యంత్రం అటు షాపువారికి, కస్టమర్లకు నమ్మదగినవిగా వుంటున్నాయి.



# ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

## యోగుల ఉన్నతాశయాలు

తమ సాధన మూలంగా ఆత్మజ్ఞానాన్ని సంపాదించి తరించే యోగులకు లౌకికాలతో సంబంధం ఉండదు. అయినా లోకోపకార పరాయణులైన ఆ మహనీయులు ప్రజలకు ప్రబోధాలివ్వడమే కాకుండా ప్రజాహిత కార్యాచరణలో దీక్ష వహిస్తారు. తాము తరించడంతో తృప్తిపడి ఊరుకోరు. అలా ఊరుకుంటే అది స్వార్థం క్రిందికి లెక్క వస్తుందనే వారి అభిప్రాయం.

ఈ పద్ధతి మనకు ప్రాచీనకాలం నుంచీ వస్తూనే ఉన్నది. లౌకిక విషయాలతో సంబంధం లేని మహామునులు అడవులలో తపస్సు చేసుకుంటున్నా, దేశానికి ఏదైనా ఉపద్రవం కలిగినప్పుడు దానిని నివారించడం కోసం తగిన ప్రయత్నాలు చేసేవారు. తమ వద్దకు సలహాల కోసం వచ్చిన రాజులకు తగిన సలహాలిచ్చేవారు. అంతేకాని — "ఏది ఎలాపోతే మనకేమి ?" అనే విరక్తభావంతో ఉండేవారు కారు.

ఈ కాలంలోకూడా వివిధ మత ప్రచారకులు కేవలం మత ప్రబోధంతోనే తృప్తిపడకుండా ప్రజోపయోగ కార్యాలను నిర్వహిస్తూ ఉండడం అందరికీ తెలుసు. స్వామి వివేకానందులు విదేశాలలో ఆధ్యాత్మిక ప్రబోధం చేసేటప్పుడు "భారతీయులకు మీరు సహాయం చేయదలిస్తే మత ప్రబోధం వల్ల ప్రయోజనంలేదు. ఉత్తమ మత సిద్ధాంతాలు మాకు సమృద్ధిగా ఉన్నవి అందులో దారిద్ర్యంలేదు. ఉన్న దారిద్ర్యం జీవనంలోనే. ఆర్థికంగా చేసే సహాయమే నిజమైన సహాయం" అని పాశ్చాత్యులకు తెలియజేశారు. ఆయన ప్రయత్నం వల్లనే భారతదేశంలో మాత్రమేకాక ప్రపంచంలోని పెక్కు దేశాలలో శ్రీ రామకృష్ణ మఠాలు వెలసి ఎనలేని ప్రజాసేవ చేస్తున్నవి. ఎన్నో వైద్యశాలలూ, విద్యాలయాలు స్థాపించబడినవి. క్రైస్తవ మత ప్రచారకులు చేసిన ప్రజాసేవ ప్రశంసించదగినది. మనదేశంలో విద్యా ప్రచారానికి పూనుకొన్నది ఆ మత ప్రచారకులే ! వైద్యశాలలనుకూడా వారు ఎన్నో నెలకొల్పారు.

చెప్పవచ్చినదేమిటంటే — మనదేశంలోని సన్న్యాసులు నాటికీ, నేటికీ కూడా నిస్వార్థమైన ప్రజాసేవకు కంకణం కట్టుకున్న వారేకాని, తమ దారి తాము చూచుకొనే స్వార్థపరులు కారని. సన్న్యాసులే ఇలా ఉన్నప్పుడు ఉదారులైన గృహస్థులు కొంతవరకైనా ప్రజాసేవకు పాటుపడడం వారి ధర్మం. ★

మీ అన్నయ్య ఆ ఇల్లు అమ్మేశారని — వేరే ఇంకొక ఆమెతో వుంటున్నారని తెలిసింది !" ఆగింది లలిత ఏదో సందేహించినట్లు.

"అవును. నిన్న ఏలూరు వచ్చినప్పుడే నాకా విషయం తెలిసింది. చివరికి నిన్నిట్లా చూస్తాననుకోలేదు వదినా ! నీ గొలుసు సంగతి తెలియబరచి నా సంగతులు రాద్దామని ఎప్పటికప్పుడు అనుకునేవాడిని. కాని... నా కాళ్లమీద నేను నిలబడిన తర్వాత — ప్రయోజకుడిగా నీ కళ్లకు కనపడి — నిన్ను ఆశ్చర్యంలో — ఆనందంలో ముంచాలనుకున్నాను. ఎన్ని కలలు కన్నాను ! నీ గొలుసు తాకట్టు పెట్టి ఆ డబ్బుతో గడుపుతూ వుద్యోగం కోసం ప్రయత్నాలు జరిపాను. నేను మంచి మార్కులతో ప్యాసు కావడంవల్ల ఎక్కువ శ్రమ పడకుండానే చిన్న వుద్యోగం దొరికింది. నా పట్టుదల విడిచిపెట్టకుండా — నువ్వు కోరుకున్నట్లు — రాత్రి పూట కాలేజీలో చదివి డిగ్రీ పూర్తిచేశాను. దానివల్ల నాకు ప్రమోషను కూడా వచ్చింది. ఇదంతా నీ ఆశీర్వాదంవల్లనే... నువ్వు చల్లని మనసుతో నన్ను చేరదీయకపోయివుంటే నేనేమైపోయి వుండేవాడిని వదినా ? నేను మీకు దూరమైపోతే మీ ఇద్దరిమధ్య నా గురించిన ఘర్షణలు వుండవు. ఆ విధంగానైనా నువ్వు సుఖపడతావనుకున్నాను. సరే ! జరిగిందేదో జరిగింది. నావల్ల పొరపాటే కావొచ్చు. చిన్నప్పుడు నా తప్పుల్ని క్షమించలేదూ ?

### గొలుసు

ఈ గొలుసు విషయం కూడా అట్లాగే అనుకో ! ఇంక ఆ విషయాల్ని మరిచిపోయి నన్ను క్షమించి — నాతో వచ్చేయి వదినా ! ఇంక నువ్విక్కడ వుండటమెందుకు ? నేను తీసుకెళ్తాను."

"నీతోనా ?" అన్నది ఆశ్చర్యంగా.

"అవును ! ఇన్నాళ్లూ కష్టాలూ — కన్నీళ్లేగా నీకు ! అవన్నీ మరిచిపోయి నిశ్చింతగా వుందువుగాని ! నా రుణం ఇట్లా అన్నా తీర్చుకోనీయి ! నువ్వు నా గురించి చేసిన త్యాగంలో కనీసం నూరోవంతయినా నన్ను రుణం తీర్చుకోనివ్వు !" ఆర్ద్రంగా అన్నాడు.

లలిత ముఖం ఎర్రబడిపోయింది. భరించలేనంత ఆవేదన, కోపం కలిగినియ్.

"మీ ఇద్దరన్నదమ్ములూ చాలా సమర్థులు సుమీ ! మీ అన్నయ్య వ్యసనపరుడయితే — నువ్వు స్వార్థపరుడివి ! మీ ఇద్దరిమధ్య నలిగి నాశనమయింది నేను ! ఇంకా నన్ను ఏం చేయదల్చుకున్నావు ?" ఆమెకు ఆవేశంతో మాటలు రావడం లేదు.

కాశీనాథం లలిత ధోరణికి అదిరిపడ్డాడు.

"వదినా ! నువ్వేనా - ఇట్లా మాట్లాడేది?"

"ఆఁ ! నేనేనయ్యా ! ఏం ? ఆశ్చర్యంగా వుందా ? నిజాలు అట్లాగే వుంటాయి మరి ! మీ దృష్టిలో నేనొక మరబొమ్మను కదూ ? ఆయన పొమ్మంటే వచ్చాను. నువ్వు రమ్మంటే వస్తాననేగా నీ వుద్దేశ్యం ? ఏం ? నాకు వ్యక్తిత్వం, అభిమానం లేవనుకున్నావా ? నేనెవరిమీదైనా ఎందుకు ఆధారపడి వుండాలి ? నన్ను నేను పోషించుకోలేననుకుంటున్నావా? అక్కడినుంచి వచ్చాక ఇన్నేళ్లూ ఎట్లా వుంటున్నాననుకుంటున్నావు ? నా కన్నవాళ్లు పోషిస్తున్నారనుకుంటున్నావా ? ఇదిగో... విను కాశీ ! నేనూ ఆ కాలంలోనైనా కాస్త చదువుకున్నాను. నా కెవరి దయాదాక్షిణ్యాలు అవసరంలేదయ్యా !" తీవ్రంగా అంటూ చటుక్కున లేచి నిలబడింది.

"నా వుద్దేశ్యం అదికాదు వదినా ! నా మాట విను... నువ్వు నాతో వస్తే..." ప్రాధేయపూర్వకంగా ఏదో అనబోయాడు కాశీ.

"రాను కాశీ ! ఇంక నువ్వు నాకేం చెప్పనవసరం లేదు. తెల్లవారగానే నీ త్రోవను నువ్వెళ్లిపో ! ఏదీ ఆ గొలుసిట్లా ఇవ్వు !" అని తీసుకుని మెడలో వేసుకుంది. "ఇప్పుడు నీకు తృప్తిగా వుందా ? నా గొలుసు నాకిచ్చి నీ రుణం తీర్చుకున్నావు. ఇంక నువ్వు రుణగ్రస్తుడివి కావు కాశీ ! నువ్విక నిశ్చింతగా వెళ్లొచ్చు !" రోషపడుతున్న మనసుని అదుపులోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూ — నెమ్మదిగా — స్పష్టంగా అనేసి గిరుక్కున వెనుతిరిగి మెట్లవైపు వడివడిగా నడిచింది. 'రుణం తీర్చుకుంటాడుట ! రుణం !!' గొణుక్కుంది — పొంగివస్తున్న దుఃఖాన్ని అదిమిపెడ్తూ. తన మెడలోని గొలుసు ఆ క్షణంలో వెయ్యి టన్నుల బరువుగా తోచింది లలితకు ! ●